# ఎడతెరిపి లేని వర్షం

■ పొంగి పొర్లుతున్న వాగులు, కుంటలు ■ చెరువులకు జల కళ
■ కల్వర్టులు, బ్రిడ్జిలపై నుంచి నీరు ప్రవహిస్తుండడంతో నిలిచిన రాకపోకలు ■నీట మునిగిన పంటలు
■ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా యంత్రాంగం సూచన ■ పలు గ్రామాల్లో కూలిన ఇండ్లు

జిల్లా వ్యాప్తంగా రెండు రోజుల నుంచి ఎడతెరిపిలేని వర్షం కురుస్తున్నది. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. చెరువులు, కుంటలు మత్తడి దుంకుతున్నాయి. పలు ప్రాంతాల్లో వాగులు, వంకలు రోడ్లపై నుంచి ప్రవహించడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. కల్వర్టులు, బ్రిడ్జిలపై నుంచి నీరు ప్రవాహిస్తుండడంతో పలుచోట్ల రోడ్లను మూసివేశారు. ఎలాంటి ప్రమాదాలు చోటు చేసుకోకుండా స్థానిక యంత్రాంగం, ప్రజాప్రతినిధులు జాగ్రత్తలు తీసుకున్నారు. కురుస్తున్న వర్షాలతో ప్రజలు, వాహనదారులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా యంత్రాంగం సూచించింది. పొంగి పొర్లుతున్న వాగులు, చెరువుల వద్దకు వెళ్లి సెల్ఫీలు దిగవద్దని సూచించారు. గ్రామాల్లో పాత భవనాలు, కూలిపోయే స్థితిలో ఉన్న వాటిని గుర్తించి ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. పలు గ్రామాల్లో ఇండ్లు కూలిపోయాయి. వరి, పత్తి, మొక్కజొన్న తదితర పంటలు నీట మునిగాయి. పిడుగుపాటుకు పశువులు మృతి చెందాయి.

– న్యూస్ నెట్‌వర్క్, సిద్దిపేట జిల్లా, సెప్టెంబర్ 1


ధూళిమిట్ట: మత్తడి పోస్తున్న కూటిగల్ నల్ల చెరువు


హుస్నాబాద్ : వర్షపు నీటితో చెరువులా మారిన ఆర్టీసీ బస్టాండ్


హుస్నాబాద్ టౌన్: మత్తడి దూకుతున్న పల్లె చెరువు


కొండపాక (కుకునూరుపల్లి) : మత్తడి పోస్తున్న కలకలమ్మ చెరువు


నంగునూరు : నంగునూరు బ్రిడ్జి వద్ద స్థానికులతో మాట్లాడుతున్న పోలీసులు


సిద్దిపేట : ఆర్డీవో క్యాంప్ కార్యాలయంలో నిలిచిన వరదనీరు


సిద్దిపేట అర్బన్ : మందపల్లి వాగును పరిశీలిస్తున్న సీపీ అనురాధ


వర్గల్ : నెంటూర్‌లో భారీ వర్షానికి దెబ్బతిన్న పెంకుటిల్లు


దుబ్బాక : ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షం


కొమురవెల్లి: మత్తడి పోస్తున్న గురువన్నపేట చెరువు


మద్దూరు: మత్తడి పోస్తున్న గాగిల్లాపూర్ పెద్ద చెరువు


చిన్నకోడూరు : రామునిపట్ల, గోనెపల్లి రోడ్డుపై ఉధృతంగా ప్రవహిస్తున్న వాగు


చేర్యాల: ఆంజనేయస్వామి ఆలయంలోకి చేరిన వర్షపు నీరు


కోహెడ : గుండారెడ్డిపల్లి కట్టు కాల్వను పరిశీలిస్తున్న తహసీల్దార్


బెజ్జంకి : వర్షంతో గ్రామ పంచాయతీ వద్ద కూలిపోయిన వేప చెట్టు


నారాయణరావుపేట : మాటిండ్లలో మత్తడి దూకుతున్న నక్కవాగు


గజ్వేల్: రిమ్మనగూడలో నీట మునిగిన పంటలు


అక్కన్నపేట: వరద దాటుకుంటూ స్వగ్రామమైన బొడిగపల్లికి కుటుంబ సమేతంగా వెళ్తున్న ప్రముఖ జానపద గాయకురాలు గొట్టె కనకవ్వ


రాయపోల్ : మిరుదొడ్డిలో జలమయంగా మారిన ప్రధాన రోడ్డు

## వర్షాల కారణంగా ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

**దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి**



దుబ్బాక, సెప్టెంబర్ 1 : ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు నియోజకవర్గ ప్రజలు, రైతులు అప్రమత్తంగా ఉండాలని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి సూచించారు. వర్షాలు కురుస్తున్న సందర్భంగా ఆదివారం ఎమ్మెల్యే స్థానిక విలేకరులకు ఫోన్ ద్వారా ప్రజలను అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అధికారులు అందుబాటులో ఉంటూ ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని సూచించారు. గ్రామాల్లో పాత ఇండ్లు తడిసిపోవడంతో కూలిపోయే ప్రమాదం ఉందని, అక్కడ ఉండే వారు వెంటనే ఖాళీ చేయాలని సూచించారు. అధికారులు స్పందించి వారిని డబుల్ బెడ్ రూం ఇండ్లు, ప్రభుత్వ పాఠశాలలు, రైతు వేదికలు, కమ్యునిటీ భవనాలు, గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో తాత్కలికంగా నివాసం కల్పించి, భోజన సౌకర్యాలు ఏర్పాటు చేయాలని సూచించారు. రైతులు వ్యవసాయ పనులు త్వరగా ముగించుకుని ఇండ్లకు చేరుకోవాలన్నారు. వాగులు, చెరువులు, కుంటలు నిండి పొంగే అవకాశం ఉందన్నారు. చెరువులు, కుంటల వద్ద సెల్ఫీలు దిగి ప్రాణాల మీదికి తెచ్చుకోవద్దని సూచించారు. మత్స్యకారులు చేపల వేటకు వెళ్ల వద్దని, ప్రజలు లోతట్టు ప్రాంతాలకు వెళ్లరాదని సూచించారు. కరెంట్ స్తంభాలు, వైర్లకు పిల్లలను దూరంగా ఉండేలా చూడాలని సూచించారు. వర్షం కారణంగా గ్రామాల్లో ఇబ్బందులు తలెత్తితే వెంటనే తహసీల్ కార్యాలయం, గ్రామ పంచాయతీ కార్యదర్శికి సమచారం అందించాలని సూచించారు. అధికారులు అప్రమత్తంగా ఉంటూ ప్రజలకు సేవలందించాలని తెలిపారు.

## అప్రమత్తంగా ఉండి జాగ్రత్తలు తీసుకోవాలి

**జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి**



చేర్యాల, సెప్టెంబర్ 1 : జనగామ నియోజకవర్గంలోని గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి ప్రకటనలో తెలిపారు. భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజలందరూ అప్రమత్తంగా ఉండి జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పాత ఇండ్లల్లో ఉండే వాళ్లు తెలిసిన వారి ఇండ్లలోకి వెళ్లాలని సూచించారు. కరెంట్ స్తంభాలు, వైర్లకు, విద్యుత్ పరికరాలకు దూరంగా ఉండాలన్నారు. ఎక్కడైన చెట్లు, స్తంభాలు, విద్యుత్ వైర్లు తెగిపడితే సిబ్బంది, పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తున్నందున వాగులు, చెరువుల వద్దకు వెళ్లవద్దని సూచించారు. రోడ్లపై వాహనాలపై వెళ్లేటప్పుడు జాగ్రత్తగా తక్కువ స్పీడ్‌తో వెళ్లాలని సూచించారు. అనవసరంగా బయటకు రావొద్దని, వర్షం కురిసినప్పుడు చెట్ల కిందకు, స్తంభాల కిందకు వెళ్లవద్దని పిడుగుపాటు గురయ్యే అవకాశం ఉంటుందన్నారు.

**సహాయక చర్యలు చేపట్టాలి**

చేర్యాల, సెప్టెంబర్ 1 : వర్షాల నేపథ్యంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సహాయక చర్యలు చేపట్టాలని చేర్యాల మున్సిపల్ కమిషనర్ చుంచు నాగేందర్‌కు ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి సూచించారు. ఆదివారం సాయంత్రం చేర్యాల మున్సిపల్ కమిషనర్‌కు ఎమ్మెల్యే పల్లా ఫోన్ చేసి వార్డుల వారీగా వివరాలు అడిగి తెలుసుకున్నారు. సోమవారం కుడా వర్షం కురిసే అవకాశం ఉండటంతో ప్రజలకు అవసరమైన సహాయక చర్యలు చేపట్టాలన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో ముందుకు సాగాలని సూచించారు. ప్రజలకు ఇబ్బందులు కాకుండా పార్టీ శ్రేణులు సహాయ సహాకారాలు అందించాలన్నారు.

## నేటి ప్రజావాణి రద్దు

**కలెక్టర్ మనుచౌదరి**

సిద్దిపేట కలెక్టరేట్, సెప్టెంబర్ 1 : జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా సోమవారం కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు కలెక్టర్ మను చౌదరి ప్రకటనలో తెలిపారు. ప్రజలు ఈ కార్యక్రమానికి రావద్దని సూచించారు.


**నేడు విద్యాసంస్థలకు సెలవు**

జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా సోమవారం విద్యా సంస్థలకు సెలవు ప్రకటిస్తున్నట్లు కలెక్టర్ మను చౌదరి తెలిపారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బంది కలగ రాదనే ఉద్దేశంతో జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలలు, ఐటీఐలు, రెసిడెన్షియల్ విద్యా సంస్థలకు సెలవు ప్రకటిస్తున్నట్లు తెలిపారు. ఆయా విద్యా సంస్థలు ఈ ఆదేశాలను అమలు చేయాలని సూచించారు.

**కలెక్టర్ ఆదేశాల మేరకు..**

సిద్దిపేట అర్బన్, సెప్టెంబర్ 1 : వర్షాల నేపథ్యంలో కలెక్టర్ ఆదేశాల మేరకు విద్యా సంస్థలకు సోమవారం సెలవు ప్రకటిస్తున్న డీఈవో శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు.

## బ్రెయిన్ స్ట్రోక్‌తో చిన్నారి మృతి


స్వీకృత (ఫైల్)

కొండపాక (కుకునూరుపల్లి), సెప్టెంబర్ 1 : కుకునూరుపల్లి మండల పరిధిలోని తిప్పారం గ్రామానికి చెందిన చిన్నారి బ్రెయిన్ స్ట్రోక్‌తో మృతి చెందింది. స్థానికులు తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన పద్మావతి కనకరాజు దంపతుల కూతురు స్వీకృత (6) కొండపాక మండల కేంద్రంలోని వేద ఇంటర్నేషనల్ స్కూల్‌లో ఒకటో తరగతి చదువుతున్నది. ఐదు రోజుల క్రితం తీవ్ర జ్వరంతో ఇబ్బంది పడిన చిన్నారి స్వీకృత శనివారం పాఠశాలకు వెళ్లిన కాసేపటికే వాంతులు చేసుకోవడంతో పాఠశాల యాజమాన్యం తల్లిదండ్రులకు సమాచారం అందించారు. చిన్నారిని సిద్దిపేటలోని ఒక ప్రైవేటు దవాఖానకు తరలించారు. చికిత్స పొందుతున్న చిన్నారికి బ్రెయిన్ స్ట్రోక్ రావడంతో శనివారం రాత్రి 11 గంటలకు మృతి చెందింది. తల్లిదండ్రులతో పాటు కుటుంబ సభ్యులు శోకసంద్రంలో మునిగిపోయారు. పాఠశాల యాజమాన్యం విద్యార్థి స్వీకృత మృతికి సంతాపం తెలుపుతూ సోమవారం పాఠశాలకు సెలవు ప్రకటించింది.

## జాన్ వెస్లీ మృతికి హరీశ్‌రావు సంతాపం


జాన్‌వెస్లీ (ఫైల్)

సిద్దిపేట, సెప్టెంబర్ 1 : విశ్రాంత ఉపాధ్యాయుడు తెలంగాణ ఉద్యకారుడు జాన్‌వెస్లీ గుండెపోటులో మృతి చెందడంతో మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఉపాధ్యాయుడిగా ఉద్యోగ ధర్మంతో పాటు సామాజిక సేవలో భాగస్వామ్యం అయ్యేవాడని, పేదలకు సేవ చేయడంలో ముందున్నారని ఆయన చేసిన సేవలను కొనియడారు. తెలంగాణ ఉద్యమంలో చురుగ్గా పాల్గొన్న ఉద్యమకారుడు వెస్లీ అన్నారు. బీఆర్‌ఎస్‌కు తనకు వ్యక్తిగతంగా ఎంతో ఆత్మీయత ఉందని గుర్తు చేశారు.

## అనారోగ్యంతో మాజీ ఎంపీపీ మృతి



అనంతుల శారద(ఫైల్)

కొండపాక (కుకునూరుపల్లి), సెప్టెంబర్ 1: కొండపాక మాజీ ఎంపీపీ అనంతుల శారద కొంత కాలంగా క్యాన్సర్ వ్యాధితో బాధపడుతూ ఆదివారం హైదరాబాద్‌లోని ఒక ప్రైవేటు దవాఖానలో మృతిచెందింది. శారద కొండపాక సర్పంచ్‌గా, ఎంపీటీసీగా గెలుపొంది ఎంపీపీగా ప్రజలకు సేవలు అందించారు. ఆమె అంత్యక్రియలు మంగళవారం కొండపాకలో నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

**చెరువుల్లోకి వెళ్లొద్దు**

సిద్దిపేట టౌన్, సెప్టెంబర్ 1 : మత్స్యకారులు చేపలు పట్టడానికి వెళ్లి ప్రమాదాన్ని కొని తెచ్చుకోవద్దని సిద్దిపేట టూటౌన్ సీఐ ఉపేందర్ సూచించారు. సర్కిల్ పరిధిలోని సాజిద్ పుర చెరువు నిండడంతో కొందరు మత్స్యకారులు ఆదివారం చేపలు పట్టడానికి చెరువులోకి దిగారు. గమనించిన సీఐ వారికి కౌన్సెలింగ్ నిర్వహించి అక్కడి నుంచి పంపారు.

## అత్యవసరమైతేనే ప్రజలు బయటకు రావాలి


వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్, జిల్లా అధికారులు

సిద్దిపేట కలెక్టరేట్, సెప్టెంబర్ 1: భారీ వర్షాల నేపథ్యంలో అత్యవసరమైతే తప్ప ప్రజలు బయటకు రావద్దని గృహ నిర్మాణ, సమాచార సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాం తికుమారి ప్రజలకు సూచించారు. ఆదివా రం వారు సచివాలయం నుంచి వీడియో కా న్ఫరెన్స్ ద్వారా ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. భారీ వ ర్షాలు కురుస్తున్నందున ప్రాణ నష్టాలను త గ్గించేలా అత్యవసర సేవలు అందించాలన్నారు. రానున్న రెండు రోజులు ఎవరికీ సెలవులు మంజూరు చేయరాదన్నారు. అనంతరం కలెక్టర్ అధికారులతో మాట్లాడుతూ జిల్లాలో ఇంకో రెండు రోజులు అధికంగా వర్షాలు కురిసే అవకాశం ఉందని, ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా చూడాలన్నారు. వీసీలో అధికారులు పాల్గొన్నారు.

## భారీ వర్షంలోనూ వరద సహాయక చర్యలు



సహాయక చర్యలు పరిశీలిస్తున్న చైర్‌పర్సన్ ఆకుల రజితావెంకన్న తదితరులు

హుస్నాబాద్‌టౌన్, సెప్టెంబర్ 1: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షంతో ఆదివారం పట్టణంలోని పలు ప్రాంతాలు వరదనీటిలో చిక్కుకున్నాయి. దీంతో మున్సిపల్‌కు చెందిన ప్రత్యేక బృందంతో ఎక్కడకక్కడ వరదనీరు ఇండ్లలోకి చేరకుండా మురుగు కాల్వలకు మళ్లించేందుకు కృషి చేశాయి. పట్టణంలో వరద ఉధృతి ప్రాంతాలను చైర్‌పర్సన్ ఆకుల రజితావెంకన్న ఆధ్వర్యంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, సిబ్బంది బృందం పర్యటించి సహాయక చర్యలు చేపట్టారు. నాగారం రోడ్డు, బీసీ కాలనీ, ప్రధాన రహదారికి ఇరువైపులా ఉన్న ఇండ్లలోకి వరద నీరు చేరడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. బస్ డిపో ప్రాంతంలో ప్రహరీ కూలిపోవడంతో ఆ సమయంలో ఎవరూ లేకపోవడంతో పెనుప్రమాదం తప్పింది. కార్యక్రమంలో మున్సిపల్‌వైస్‌చైర్‌పర్సన్ అయిలేని అనిత, కమిషనర్ టి. మల్లికార్జున్‌గౌడ్, శానిటరీఇన్‌స్పెక్టర్ బాల ఎల్లంతోపాటు పలువురు మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

**ఆదుకోవాలని కన్నీరు పెట్టుకున్న కనకవ్వ**

వానతో వరదొచ్చి నా ఇల్లు అంతా మునిగింది. నాకు పాత ఇళ్ల తప్ప వేరే దిక్కులేదు. పొద్దటి నుంచి ఒకటే వాన ఏమిసెయాలే మేడం. నా బాధ గిట్ల ఉందంటూ కస్తూరిబా కాలనీకి చెందిన గడ్డం కనకవ్వ ప్రజాప్రతినిధులు, అధికారుల ముందు కన్నీరు పెట్టుకుంది. వరదనీరు ఇండ్లలోకి వచ్చి ఏమిసెయ్యకుంట సేసింది. మీరే మమ్మల్ని కాపాడాలంటూ కన్నీరుపెడుతూ దండాలు పెట్టింది. స్పందించిన చైర్‌పర్సన్ ఆకుల రజితావెంకన్న మీకు స్కూల్‌లో పునరావసం ఏర్పాటు చేశామంటూ ఆమెను ఓదార్చారు.

## ఘనంగా బోనాలు


నల్లపోచమ్మకు బోనం సమర్పిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ స్వరూపారాణి

చేర్యాల, సెప్టెంబర్ 1 : శ్రావణ మాసం చివరి ఆదివారం పురస్కరించుకొని మహిళలు గ్రామ దేవతలకు బోనాలు సమర్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ స్వరూపారాణి, వైస్ చైర్మన్ నిమ్మ రాజీవ్‌రెడ్డి, కౌన్సిలర్లు నాయకులు పాల్గొన్నారు.

## అన్ని వర్గాల అభ్యున్నతే హరీశ్‌రావు ధ్యేయం

సిద్దిపేట, సెప్టెంబర్ 1 : అన్ని వర్గాల ప్రజల అభ్యున్నతే ధ్యేయంగా ఎమ్మెల్యే హరీశ్‌రావు పని చేస్తున్నారని మున్సిపల్ చైర్ పర్సన్ కడవేర్గు మంజులారాజనర్సు అన్నారు. ఆదివారం పట్టణంలోని 2వ వార్డు నర్సపురంలో నిర్మించిన అంబేద్కర్ భవనాన్ని హరీశ్‌రావు అదేశాల మేరకు ప్రారంభించారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ కనుకరాజు, కౌన్సిలర్ నాయని చంద్రం, నాయకులు రాములు, నర్సింహులు, ఎల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

## అధికారులు అప్రమత్తంగా ఉండాలి

సిద్దిపేట, సెప్టెంబర్ 1: భారీ వర్షాల నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్‌కుమార్ అన్నారు. ఆదివారం వర్షంలోనే పట్టణంలో పర్యటించారు. డీఆర్‌ఎసీసీ సెంటర్, బుస్సాపూర్ రీసెర్స్ సెంటర్, బయోగ్యాస్ కేంద్రాన్ని సందర్శించారు. ఇర్కోలలోని స్లాటర్ హౌస్ పరిశీలించారు. మేకలు, గొర్రెల వద ఇక్కడ జరిగేలా చర్యలు తీసుకోవాలని శానిటరీ ఇన్స్‌పెక్టర్లను ఆదేశించారు. పట్టణ శివారు ప్రాంతాల్లో చెత్తను పార వేయకుండా పర్యవేక్షించాలన్నారు.

## వాహనం ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి

గజ్వేల్, సెప్టెంబర్ 1 : ఓ వాహనం ఢీకొనడంతో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన మండల పరిధిలోని రిమ్మనగూడ రాజీవ్ రహదారిపై ఆదివారం జరిగింది. సీఐ సైదా తెలిపిన వివరాలు.. మృతుడి వయసు 65 నుంచి 70 ఏండ్లు ఉంటుందని, తల వెంట్రుకలు జడలాగా కట్టి, గోధుమ రంగు టీషర్టు ధరించి ఉన్నాడని తెలిపారు. మృతదేహాన్ని గజ్వేల్ ప్రభుత్వ దవాఖాన మార్చురీలో భద్రపరిచినట్లు తెలిపారు. మృతదేహాన్ని గుర్తించిన వారు గజ్వేల్ పోలీసులను సంప్రదించాలన్నారు.

## ముంపు ఇండ్లను ఖాళీ చేయించిన అధికారులు


కమలాయపల్లిలో వర్షపునీటిని ఇండ్లలోకి వెళ్లకుండా మళ్లిస్తున్న అధికారులు

మద్దూరు (ధూళిమిట్ట), సెప్టెంబర్ 1 : చేర్యాల మండలంలోని కమలాయపల్లిలో కొన్నేండ్లుగా వర్షానికి పలు ఇండ్లలోకి వర్షపు నీరు చేరుతుండడంతో గ్రామస్తులు పడుతున్నారు. ఈ ఘటనపై ఆదివారం నమస్తే తెలంగాణలో వచ్చిన 'వానొస్తే.. నీటమునగాల్సిందే..!' కథనానికి పంచాయతీ అధికారులు స్పందించారు. ఎంపీవో వీరరాజు, పంచాయతీ కార్యదర్శి రాజుగౌడ్ గ్రామాన్ని సందర్శించి ఇంట్లోకి వర్షపునీరు వెళ్లడంతో నివాసయోగ్యంగా లేని కునికంటి రాజ్‌కుమార్ కుటుంబాన్ని మరో ఇంటికి పంపారు. పంచాయతీ కార్యదర్శి రాజు సొంత ఖర్చులతో బాధిత కుటుంబానికి 25కిలోల బియ్యాన్ని అందజేశారు. స్పందించిన పంచాయతీ అధికారుల ను కొమురవెల్లి ఆలయ కమిటీ మాజీ చైర్మన్ వజ్రోజు శంకరాచారి ప్రత్యేకంగా అభినందించారు.

## రక్తదానం ప్రాణదానంతో సమానం



రక్తదానం చేస్తున్న రక్తదాతలు

సిద్దిపేట టౌన్, సెప్టెంబర్ 1 : రక్తదానం ప్రాణ దానంతో సమానమని సిద్దిపేట వాసవి వనితా క్లబ్ అధ్యక్షురాలు మర్యాల వాణి అన్నారు. వాసవి క్లబ్ వ్యవస్థాపకుడు చంద్రసేన గుప్తా జయంతిని పురస్కరించుకొని ఆదివారం సిద్దిపేటలో రక్తదానం శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా స్వచ్ఛందంగా పలువురు రక్తదానం చేసి స్ఫూర్తిగా నిలిచారు. అనంతరం వాణి మాట్లాడుతూ.. చంద్రసేన గుప్తా వాసవి క్లబ్‌ను స్థాపించి పేదలకు అండగా నిలిచారని కొనియాడారు. కార్యక్రమంలో నవీన్, మల్లారెడ్డి, వీరేశం, అజయ్ కుమార్, సాయి, నిఖిల్, వేణుగోపాల చారి, గిరిబాబు పాల్గొన్నారు.

## 9న అంబేద్కర్‌నగర్ మాదిగ సంఘం ఎన్నికలు


మాదిగ భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

హుస్నాబాద్‌టౌన్, సెప్టెంబర్ 1: పట్టణంలోని అంబేద్కర్‌నగర్‌కు చెందిన మాదిగ సంఘం, మాదిగ యువజన సంఘం ఎన్నికలు ఈ నెల 9న నిర్వహించాలని సంఘం నిర్ణయించింది. ఆదివారం 19వ వార్డులోని మాదిగభవన్‌లో వార్డు కౌన్సిలర్, గౌరవ అధ్యక్షుడు బొజ్జ హరీశ్, ఎన్నికల కమిటీ కన్వీనర్ గసికంటి హరికిషన్ ఆధ్వర్యంలో మాదిగల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎన్నికల్లో పోటీ చేసే వారు ఈ నెల 5వరకు నామినేషన్లు, 6న ఉపసంహరణ, 9న ఎన్నికలు నిర్వహించాలని సమావేశంలో నిర్ణయించారు. సమావేశంలో ఎమ్మార్పీఎస్ పట్టణ ఇన్‌చార్జి బత్తుల చంద్రమౌళి, నాయకులు గడిపె కొమురయ్య, బాలు, మల్లేశం, బత్తుల శంకర్‌బాబు, గడిపె సంపత్, రాజమల్లు, గణేశ్ తదితరులు పాల్గొన్నారు.

## గజ్వేల్ ఏఎంసీ చైర్మన్‌గా నరేందర్‌రెడ్డి

గజ్వేల్, సెప్టెంబర్ 1: గజ్వేల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గాన్ని ఖరారు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా జగదేవ్‌పూర్ మండలం గొల్లపల్లికి చెందిన వంటేరు నరేందర్‌రెడ్డి, వైస్ చైర్మన్‌గా గజ్వేల్ పట్టణానికి చెందిన సర్దార్‌ఖాన్‌ను నియమిస్తూ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. వ్యవసాయశాఖ ఏడీ, సహకార సంఘం చైర్మన్, మున్సిపల్ చైర్మన్‌తో పాటు మరి కొందరిని డైరెక్టర్లుగా నియమించారు. ఈ సందర్భంగా పాలక వర్గ సభ్యులను మాజీ ఎమ్మెల్యే తూకుంట నర్సారెడ్డి సన్మానించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలి

సిద్దిపేట, సెప్టెంబర్ 1 : ఎన్నికల సమయంలో కాంగ్రెస్ నేతలు ఇచ్చిన హామీ ప్రకారం పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని ఉద్యోగ జేఏసీ నాయకుడు గ్యాదరి పరమేశ్వర్ అన్నారు. ఈ సందర్భంగా ఆదివారం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో జేఏసీ నేతలు విక్రంరెడ్డి, తిరుపతి రెడ్డి, వేణుగోపాల్, శశిధర్‌శర్మ, కృష్ణమూర్తి, ఖాజా తదితరులు పాల్గొన్నారు.

## 'సారంగపాణి' సేవలు మరువలేనివి

హుస్నాబాద్, సెప్టెంబర్ 1: ప్రముఖ జానపద రచయిత, గాయకుడు ధీకొండ సారంగపాణి జానపద కళారంగానికి చేసిన సేవలు మరువలేనివని టీవీ, రేడియో, జానపద గాయకుడు గడిపె మల్లేశ్ అన్నారు. ఆదివారం సారంగపాణి వర్ధంతి సందర్భంగా హుస్నాబాద్ దవాఖానలోని రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కవి మోరె బాలమురారి, కళాకారులు, సీపీఐ నాయకులు పద్మ, మల్లారెడ్డి, సంజీవరెడ్డి, బాపురావు, ప్రవీణ్, సుదర్శన్, సాయి, శ్రీకాంత్, రజిత పాల్గొన్నారు.